క్లుప్తంగా

15 ఆర్థిక సంఘం నిధుల విడుదల

సీతానగరం: ప్రభుత్వం నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు తాజాగా విడుదలైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కె కుమారవర్మ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు గాను 2024–25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండవ విడతగా రూ.30లక్షల13 వేల,429 లు విడుదలైనట్లు తెలియజేశారు. ఆయాగ్రామ పంచాయతీల అకౌంట్లకు నిధులు జమ చేయనున్నట్లు తెలియజేశారు.

పర్యాటక అభివృద్ధి శాఖాధికారి పర్యటన



వెంగళరాయ సాగర్ జలాశయాన్ని పరిశీలిస్తున్న పర్యాటక శాఖాధికారి నారాయణ రావు

సాలూరు రూరల్: జిల్లా పర్యాటక శాఖాధికారి నారాయణ రావు ఆదివారం సాలూరు మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో పర్యాటక ప్రాంతాలకు అనుకూలంగా ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తోణాం పంచాయతీ శిఖపరువు జలపాతాన్ని, వెంగళరాయ సాగర్ జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి జరిగే విధంగా చర్యలు తీసుకోవడానికి ముందస్తుగా అనుకూలంగా ఉన్న ప్రదేశాలను గుర్తించనున్నట్లు తెలిపారు.

సేవలతోనే గుర్తింపు..

పాలకొండ: పోలీసులు మంచి సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. సీఐగా ఇక్కడ విధులు నిర్వహించి విశాఖకు బదిలీపై వెళ్తున్న మీసాల చంద్రమౌళిని ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నో కీలక కేసులను సీఐ చంద్రమౌళి ఛేదించారని చెప్పారు. బదిలీ ప్రాంతంలో కూడా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, దోనుబాయి, బత్తిలి ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని జోగులదుమ్మ గ్రామానికి చెందిన బలివాడ లక్ష్మునాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి..ఆ గ్రామానికి ఆదివారం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట కన్వీనర్ కోట రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, లోలుగు నారాయణ రావు, బలగ వెంకటరమణ, సర్పంచ్ తవిటినాయుడు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యానికి మేలు..

సీతంపేట: సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని ఎస్సై వై. అమ్మన్నరావు అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం సండే ఆన్ సైకిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సైకిల్ తొక్కుతూ వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

కూలిన భారీ వృక్షం

సీతంపేట: మండలంలోని కె.గుమ్మడ సమీపంలో ఓ వృక్షం రోడ్డుపై కూలిపోవడంతో ఆదివారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో స్థానికులు స్పందించి చెట్టు కొమ్మలు తొలగించారు. దీంతో వాహన రాకపోకలకు వీలు కలిగింది.



రాయగడ రోడ్డు పరిధిలో ఉన్న డంపింగ్ యార్డులో చెత్త

డంపింగ్‌యార్డుతో తప్పని అవస్థలు

- ప్రజలకు తప్పని శ్వాసకోశ, తలనొప్పి సమస్యలు

పార్వతీపురం: పార్వతీపురం–రాయగడ రహదారి పరిధిలో ఉన్న డంపింగ్‌యార్డుతో ప్రజలకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రహదారి గుండా వందలాది వాహనాలపై ప్రజలు నిత్యం రాకపోకలు చేస్తుంటారు. దీంతో ఈ మార్గంగుండా పోవాలంటే ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోంది. పట్టణంలోని చెత్త, వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలించడంతో దుర్గంధభరితమైన వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్‌యార్డుకు పందులు, పశువులు, కుక్కలు ఇతర మూగజీవాలు వచ్చి వ్యర్థాలను చెల్లాచెదురుగా చేసి రహదారిపైకి విసిరేయడంతో పరిసరాలు మరింత అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఈగలు, దోమలు ప్రబలడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర వ్యాధులతోపాటు చర్మ సమస్యలు కూడా వస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ఒక్కొక్కసారి డంపింగ్‌యార్డుకు నిప్పుపెట్టడంతో పొగ, విషవాయువులతో వాతావరణం మరింత కాలుష్యం అవుతోంది. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్నాయి. రాయగడ రహదారి పరిధిలో ప్రజలు నివసించేందుకు కూడా ఆసక్తి చూపడం లేదు. కేవలం ఈ ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఉండడం కారణంగానే ఈ ప్రాంతం అభివృద్ధికి కూడా నోచుకోలేదు. డంపింగ్‌యార్డులో ఉన్న చెత్త చెదారాలను కంపోస్టు ఎరువులా తయారు చేయవచ్చునని ప్రజాప్రతినిధులు ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ ఆచరణలో కానరావడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డంపింగ్‌యార్డులో ఆధునిక పద్ధతుల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లైన్‌మెన్ తొలగింపు భావ్యం కాదు

- కాంట్రాక్ట్ ఉద్యోగులకు అప్పగింతకే నిర్ణయం



సీతానగరం: ఏపీఈపీడీఎల్ నిర్వహణలో ఉన్న సబ్‌స్టేషన్‌లలో రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్‌ను వేరేచోటకు పంపించి వారి స్థానంలో ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగులను నియమించాలనుకోవడం అర్థరహితం. విద్యుత్ శాఖలో 33/11 కేవీ–సబ్‌స్టేషన్లు గత 70 సంవత్సరాల నుంచి రెగ్యులర్ ఎంప్లాయిస్‌తో జిల్లాలో కొన్నిమాత్రమే నడుస్తున్నాయి. అది కూడా లైన్‌మెన్ కేడర్ ద్వారా సబ్‌స్టేషన్‌ను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో సాలూరు, మక్కువ, సీతానగరం, బలిజిపేట, పార్వతీపురంలలో ప్రభుత్వ సబ్‌స్టేషన్లున్నాయి. ఈ మేరకు లైన్‌మెన్ కేడర్‌లో విధులు నిర్వహిస్తూ ప్రమాదాలకు గురై చేతులు, కాళ్లు కోల్పోయిన వారు, ఇతరత్రా కారణాల వల్ల అంగవైకల్యానికి గురైన చాలామంది సబ్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్నారు.అలాగే ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు చాలామంది సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్నారు. ఇటీవల సబ్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్‌ను గ్రామాలకు బదిలీ చేసి వారి స్థానంలో కాంట్రాక్ట్ పద్ధతిన కొత్తవారితో విద్యుత్ శాఖ రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల ధనార్జన కోసం నియమించాలని డివిజినల్ స్థాయి అధికారులు సమాలోచన చేస్తున్నారు. దీన్ని పసిగట్టిన విద్యుత్ శాఖ సిబ్బంది ఎటువంటి సమాచారం లేకుండా ఇంతటి దుర్మార్గమైన చర్యలకు దిగడం సరికాదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే విశాఖలో ఉన్న సీఎండీ సబ్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న వారిని ఎక్కడికి పంపిస్తారని డివిజినల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం బయటకు రావడంతో అంగవైకల్యం కలిగిన వారు ఆందోళన చెందుతున్నారు.

ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయి

సబ్‌స్టేషన్లలో విధులు నిర్వహించే లైన్‌మెన్‌ల స్థానంలో కాంట్రాక్ట్ పద్ధతిన కొత్తవారి నియామకాలు జరుగుతున్నట్లు తెలిసిన విషయమై పార్వతీపురం డీఈఈ కె.గోపాలనాయుడు వద్ద ప్రస్తావించగా సబ్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ సేవలు ఫీల్డ్‌కు వినియోగించాలా? లేదా? వారినే కొనసాగించాలా? అనే అంశంపై ఆలోచనలు జరుగుతున్నాయని, ఈ విషయం ఇంకా ప్రాథమికంగా చర్చల్లోనే ఉందన్నారు.

అధ్వానంగా బైపాస్ రోడ్డు



గుంతలు పడ్డ పార్వతీపురం బైపాస్ రహదారి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం చేస్తున్నారు. ఇటీవల ఈ గుంతల్లో బైక్ స్లిప్ కావడంతో పలువురు ప్రమాదాలకు గురైన సంఘటనలు సంభవించాయి. రోడ్డు దుస్థితి గురించి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కూటమి నాయకులు, అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ రోడ్డు ఇప్పుడు వాహనదారులకే ప్రమాదకారకంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరింత మంది గాయాల పాలుకాకుండా ఎవరూ మత్యువాత పడకుండా ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి చర్యలు చేపట్టి బైపాస్ రోడ్డును బాగుచేయించాలని కోరుతున్నారు.

బైపాస్ రోడ్డును బాగు చేయించండి



బైపాస్ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో జిల్లా రోడ్ల పరిస్థితి మారలేదు. ఆ గుంతల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాల్సి ఉంది. కనీసం ఆ దిశగానైనా అధికారులు స్పందించకపోవడం శోచనీయం. వీలైనంత త్వరగా బైపాస్ రోడ్డును బాగు చేయించాలి. లేకుంటే ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం.

– ఆర్‌వీఎస్.కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రమాదకరంగా మోటార్ విద్యుత్ వైరు

పార్వతీపురం రూరల్: మండలంలోని వెలగవలస పంచాయతీ ములగవలస గ్రామంలో తాగునీటి బోరుకు వేసిన విద్యుత్‌వైరు నేలపై నుంచి దాదాపు 30 మీటర్ల సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం వరకు ఉండడంతో ప్రమాదకరంగా ఉందని మండల సీపీఎం నాయకుడు పి.రాము తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నేల తడిగా ఉండడంతో మోటారు వేసేందుకు వెళ్లిన కొర్ర మహేష్ అనే వ్యక్తికి విద్యుత్‌షాక్ తగిలగా సమస్యను గుర్తించినట్లు రాము తెలిపారు. పై నుంచి ఏర్పాటు చేయాల్సిన వైర్లను ఈ విధంగా నేలపై నుంచి నిత్యం ప్రజలు నడిచే ప్రాంతంలో ఏర్పాటు చేయడం సురక్షితం కాదన్నారు. తక్షణమే గ్రామస్తులు తాగునీటికి ఉపయోగించే మోటార్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి సరఫరాకు ఉపయోగించే విద్యుత్ వైర్‌ను స్తంభం ద్వారా ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జనాలు

సాలూరు: పట్టణంలో గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలో తెల్లవార్లు ఊరేగింపులతో ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.పట్టణ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సుమారు 60 మంది ప్రత్యేక బలగాలతో పాటు 70 మంది పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. ఒక్క ఆదివారం ఉదయం పట్టణంలో 75 వినాయక విగ్రహాల నిమజ్జనాలు జరిగినట్లు సీఐ తెలిపారు. చంద్రగ్రహణం నేపథ్యంలో ఈ ఏడాది వినాయక నిమజ్జనాలు పట్టణంలో త్వరగా పూర్తికావడం విశేషం.

'దయగల గోడ' సేవా కార్యక్రమాలు



చినభోగిలిలో రైల్వే కూలీలకు బస్తాలతో బట్టలు పంపిణీ చేస్తున్న దయగలగోడ నిర్వాహకులు విజయ్‌మోహన్, కృష్ణదాసు

సీతానగరం: మండలంలోని చినభోగిలి–రామవరం గ్రామాల మధ్య జరుగుతున్న రైల్వేలైన్ థర్డ్ ట్రాక్ పనుల కోసం జార్ఖండ్, నాగాలాండ్ ప్రాంతాల నుంచి వస్తున్న కూలీలకు దుస్తులు, దుప్పట్లు దయగలగోడ నిర్వాహకులు ఎం.విజయ్‌మోహన్, కృష్ణదాసు ఆదివారం దుస్తులు వితరణ చేశారు. దుస్తుల పంపిణీ అనంతరం వారు మాట్లాడుతూ తాము దయగలగోడ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి పేదలకు తమవంతు సహకారాన్ని అందిస్తున్నామని తెలియజేశారు. పాతబొబ్బిలి బస్టాప్ వద్ద సమకూర్చుకున్న నిధులతో చిన్న షెల్టర్ ఏర్పాటు చేశామని అన్నారు. బొబ్బిలి, గొల్లపల్లి, మక్కువ, సీతానగరం ప్రాంతాలకు తిరుగాడే ఉద్యోగులు, దాతలు పిల్లలు, పెద్దలకు వినిగించే బట్టలు ఇక్కడ వేస్తున్నారన్నారు. దాతలు దయగలగోడ వద్ద వేసిన బట్టల్లో నాణ్యతను పరిశీలించి పేదలు, బాటసారులకు ప్రతి నెలలో ఒక ఆదివారం సభ్యులతో పాటు వితరణ చేస్తున్నామన్నారు. ఈ మేరకు రెండు బస్తాలతో దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. దయగల గోడ అభివృద్ధికి అందరూ సహకరించి పేదలకు తోడ్పడాలని కోరారు. దయగల గోడకు సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



బొడ్డవలస వద్ద రోడ్డు మలుపులో బీటీ రోడ్డుకు దగ్గరగా వేసిన విద్యుత్ స్తంభం

సాలూరు రూరల్: మండలంలో ఇటీవల విద్యుత్ లైన్ల పనులు జరుగుతున్నాయి. ప్రజలకు విద్యుత్ సౌకర్యం కల్పన అటుంచితే స్తంభాల ఏర్పాటు కోసం ఇప్పటికే రోడ్డును ఆనుకుని ఉన్న భారీ వృక్షాలను తొలగిస్తున్నారు. దీనికి తోడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేటప్పుడు బీటీ రోడ్డుకు అడుగుదూరంలోనే వేస్తున్నారు. రోడ్డు తిన్నగా ఉన్న చోట కొంత ఫరవాలేదు కానీ రోడ్డు మలుపుల వద్ద ఈ విద్యుత్ స్తంభాలు వాహన చోదకులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వాహనాలు వస్తే అకస్మాత్తుగా పక్కకు తప్పుకునే క్రమంలో విద్యుత్ స్తంభాలను ఢీకొట్టే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా సాలూరు నుంచి మామిడిపల్లి వెళ్లే రహదారి పొడవునా చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉందని ఈ విషయంలో ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సి ఉందని ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వర్షాలతో నదులు, కాలువల్లో నీరు



సీతానగరం ప్రాజెక్ట్ మీదుగా ప్రవహిస్తున్న నదిలోని నీరు

సీతానగరం: మండలానికి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా సువర్ణముఖి నదిలో సీతానగరం ప్రాజెక్ట్ ద్వారా నీరు ఉధృతంగా ప్రవహిస్తుండగా తోటపల్లి కుడి కాలువ ద్వారా పూర్తిస్థాయిలో నీరు ప్రవహిస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. తోటపల్లికాలువ ద్వారా ఎక్కువమోతాదులో నీరు ప్రహించడం వల్ల కాలువకు ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు కాలువగట్టు వైపు ఆందోళనతో చూస్తూ ఉంటున్నారు. అలాగే సువర్ణముఖి నదిలో నీరు ఉధృతంగా ప్రవహించడం వల్ల పెదంకలాం వరకూ ఉన్న గ్రామాల ప్రజలకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నదిలో ఎవరూ దిగవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



బుడిపేట్ట వద్ద ఉధృతంగా పారుతున్న తోటపల్లి కాలువ నీరు

విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించండి



సుందరయ్య భవనం ఆవరణలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

పార్వతీపురం టౌన్: విజయవాడలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక సుందరయ్య భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 6న రాష్ట్రంలో ఉన్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమాన్ని పోలీసులు పాశవికంగా అణిచి వేయడాన్ని ఖండించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది పూర్తిస్థాయిలో అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో, కళాశాలలో నియమించాలి. అలాగే ఫీజు రియింబర్స్‌మెంట్ వెంటనే విద్యార్థులకు ఇవ్వాలి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇష్టానుసారం పెంచుతున్న ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ చేసిన విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై విజయవాడ పోలీసులు లాఠీచార్జి చేశారని దొరికిన వారిని దొరికినట్లు చిన్నపిల్లలని కూడా చూడకుండా వాహనాల్లో కుదేశి పడేశారని, ఆడపిల్లల చున్నీలు లాగివేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

నూతన విద్యావిధానం అమలు దుర్మార్గం

విశాఖపట్నం విద్యార్థికి చెయ్యి విరిగిందని అనేక మందికి రకరకాల గాయాలపాలయ్యారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సమస్యలు పరిష్కరాస్తామని హామీ ఇచ్చారని కూటమి ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తుండడం దుర్మార్గమన్నారు. పేద, మధ్యతరగతి పిల్లలకు విద్య అందని ద్రాక్షలా మారుతుందని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ విధానాన్ని అమలు చేయకపోయినా మన రాష్ట్రంలో ఈ ప్రభుత్వం అతి ఉత్సాహంతో అమలు చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అన్ని ప్రజాసంఘాలు మద్దతుగా నిలుస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు శ్రామిక మహిళా సంఘం నాయకురాలు వి.ఇందిర, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ, సీఐటీయూ నాయకుడు రెడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ఏర్పాటయ్యేనా..!



ఐటీఐ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలం ఇదే

- మరియగిరి సమీపంలో గతంలోనే స్థల సేకరణ
- ఈ అంశాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నాయకులు, అధికారులు స్పందించాలి: ప్రజలు

వీరఘట్టం: మండలంలో ఐటీఐ ఏర్పాటు విషయాన్ని గత ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అంగీకారం తెలిపారు. దీంతో మండల కేంద్ర సమీపంలోని మరియగిరి వద్ద సర్వే నంబర్ 5/1లో ఉన్న 5 ఎకరాల స్థలంలో ఐటీఐ ఏర్పాటు చేసేందుకు గతంలో అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. ఈ ప్రాంతంలో ఐటీఐ ఏర్పాటైతే వీరఘట్టం మండలంతో పాటు సమీపంలో ఉన్న సీతంపేట, గరుగుబిల్లి, పాలకొండ, జియ్యమ్మవలస మండలాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే స్థల పరిశీలన జరగడంతో ఐటీఐ ఏర్పాటవుతుందని ఆశించిన ప్రజానీకానికి నిరాశే మిగిలింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ అంశం గురించి పట్టించుకోలేదు. దీంతో మండలంలో ఐటీఐ ఏర్పాటు కలగానే మిగిలింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కూటమి నాయకులు, అధికారులు స్పందించి ఐటీఐ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

500 మందికి పైగా విద్యార్థులు..

ప్రతి ఏటా వీరఘట్టం, సీతంపేట, పాలకొండ, జియ్యమ్మవలస, తదితర మండలాల నుంచి టెన్త్, ఇంటర్ పాసైన విద్యార్థులు సుమారు 500 మంది వరకు ఐటీఐ చదువుకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. స్థానికంగా ఐటీఐ ఉంటే ఇక్కడే చదువుకునే వెసులుబాటు ఉంటుందని, అలాగే ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావాలి..



ప్రతి ఏటా సాంకేతిక విద్య కోసం వందలాది మంది విద్యార్థులు జిల్లాను దాటి వెళ్తున్నారు. ఐటీఐ లాంటి సాంకేతిక విద్య అందుబాటులో ఉంటే చాలా మంది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వీరఘట్టంలో ఐటీఐ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవచూపాలి.

– భోగి మణి, మెడికల్ షాపు యజమాని, వీరఘట్టం

విద్యాభివృద్ధికి కృషి చేయాలి..



స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు వీరఘట్టం మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఐటీఐ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి ఐటీఐ ఏర్పాటుకు కృషి చేయాలి.

– నల్లబిల్లి విష్ణు, వీరఘట్టం

ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి....

స్థానికంగా ఐటీఐ ఉంటే నిరుద్యోగ పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయని విద్యావేత్తలు అంటున్నారు. ముఖ్యంగా ఈ కోర్సు చేసిన వారు స్వయం ఉపాధి పొందవచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఐటీఐ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అన్ని వర్గాల సమన్వయంతో ఉత్సవాలు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానంలో ఈ ఏడాది నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్నివర్గాల సహకారం తీసుకుంటామని దేవస్థానం కార్యనిర్వహక అధికారి సూర్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగిస్తామన్నారు. ఇదిలా ఉంటే సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రధాన ఆలయంలో గల అమ్మవారు తెరచాటుకు వెళ్లనున్నట్లు తెలిపారు. నేటి నుంచి దేవస్థానం ప్రాంగణంలోగల ఉత్సవమూర్తికే పూజలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. 22న దేవస్థానంలో దసరా ఉత్సవాలకు సంబంధించి సంప్రదాయ ముహూర్తపు రాట వేస్తారని చెప్పారు. అదేరోజు అమ్మవారి నిజరూప దర్శనం మొదలుకుని శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ,ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

విశ్వకర్మ జయంతికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: కురుపాంలో ఈ నెల 17న జరిగే విశ్వకర్మ జయంతికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు విశ్వబ్రాహ్మణ సంఘం, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు చింతాడ తవిటాచారి తదితరులు ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.

వరదనీటిలో జె.కళిగొట్టు గ్రామం..

గుమ్మలక్ష్మీపురం: భారీవర్షం కారణంగా ఎల్విన్‌పేట పంచాయతీ, జె.కళిగొట్టు గ్రామంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఆదివారం మధ్యాహ్నం ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు పెద్దఎత్తున చేరుకుంది. ఈ క్రమంలో గ్రామం కూడా లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వాన నీరు వచ్చేసినట్లు పలువురు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దారు ఎస్.శేఖర్..ఆర్ఐ బి.శివతో కలిసి గ్రామాన్ని సందర్శించి గ్రామంలోకి చేరిన వరదనీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి ఎగువన రిటైనింగ్ వాల్ నిర్మించి వర్షపునీరు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తహసీల్దారును కోరారు. దీనిపై తహసీల్దారు కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.